క్లుప్తంగా

నిత్యావసరాలు అందజేత

కోడూరు: నిరుపేదలకు ఆపన్నహస్తం అందించి, సేవా కార్యక్రమాలు నిర్వహించడమే వాసవీ క్లబ్ ధ్యేయమని క్లబ్ ప్రాంతీయ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా గ్రామీణ స్థాయిలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు క్లబ్‌లను పటిష్ట పర్చాలన్నారు. నాలుగు క్లబ్ నూతన సభ్యత్వాలు, ఆరుగురికి క్లబ్ పదవులను ఇచ్చారు. అనంతరం 15 మంది పేదలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను, 25 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన



పెడన: స్వయం సహాయక గ్రూపులకు సంబంధించి మూడో విడత ఆసరా నగదు విడుదలైందని పెడన మండల ఏపీఎం శ్రీదేవి అన్నారు. ఆదివారం మండలంలోని పలు సచివాలయాల్లోను, లబ్ధిపొందిన గ్రూపు లీడర్లకు, సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేసి జాబితాలను ప్రదర్శించారు. పెడన మండలంలోని 790 గ్రూపులలోని 7,851 మంది సభ్యులకు రూ.6.79 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. సచివాలయాల్లోని నోటీసు బోర్డులో కూడా ప్రదర్శిస్తున్నారని చెప్పారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



పెడన: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు అన్నారు. స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఆదివారం నిర్వహించారు. సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గాలీవాన బీభత్సం

- ఒరిగిన చెట్లు.. విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు
- పిడుగులు పడి వరి కుప్పలు దగ్ధం





పెడన-చెన్నూరు వయా వద్లమన్నాడు మార్గంలో పడిన చెట్లను తొలగిస్తున్న పొక్లెయిన్ : మాజేరు సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పెడన: పెడన మండలంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత, ఆదివారం వేకువ జామున గాలీవాన బీభత్సం సృష్టించింది. పలు మండలాల్లోని గ్రామాల్లో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. పిడుగు పడి వరి కుప్ప దగ్ధమైంది. పెడన మండలంలోని గురువిందగుంట, చెన్నూరు మార్గంలో వయా ముదినేపల్లి మండలం నుంచి కైకలూరు, భీమవరం ప్రాంతాలకు దగ్గర మార్గమైన ఈ రోడ్డులో భారీ చెట్లు పడిపోయాయి. రోడ్డుకు అడ్డంగా రెండు చెట్లు పడిపోవడంతో వేకువ జాము నుంచి ఐదు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఈ విషయాన్ని ఎంపీపీ రాజులపాటి వాణి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణం పొక్లెయిన్ ద్వారా చెట్లను తొలగించి రోడ్డు మార్గాన్ని క్లియర్ చేశారు.

3.26 ఎకరాల వరికుప్పలు దగ్ధం

పెడన మండలం కొంగంచర్ల గ్రామంలో గుల్ల ప్రసాద్ బాబుకు చెందిన అర ఎకరం, డొక్కు కోటేశ్వరమ్మకు చెందిన 37 సెంట్లు మొత్తం 87 సెంట్ల వరి కుప్ప పిడుగు పడి దగ్ధమైంది. నడుపూరు గ్రామానికి చెందిన మెరుగుమాల సత్యవతికి చెందిన 2.39 ఎకరాల వరి పొలం కొంకేపూడి గ్రామ సమీపంలో ఉంది. ఈ పొలంలోని వరికుప్పపై పిడుగుపడి అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు హుటాహుటిన మంటలను అదుపులోకి తీసుకువచ్చి కుప్పను చెల్లాచెదురుగా చేసి నిప్పురవ్వలు లేకుండా ఆర్పివేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

మండలంలోని గాలీవాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు పాతవి విరిగిపోగా కొత్తవి నేలకొరిగాయి. విద్యుత్ శాఖాధికారులు స్పందించి వాటిని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. ముచ్చర్ల, గురువిందగుంట, కవిపురం, దిరిశవల్లి గ్రామాల సమీపంలోని సుమారు ఆరు స్తంభాలు నేలకొరిగాయి. మచిలీపట్నం నుంచి చల్లపల్లి వెళ్లే మార్గంలోని మాజేరు సమీపంలో మూడు విద్యుత్ స్తంభాలు ప్రధాన లైనుకు సంబంధించినవి నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

బాధిత కుటుంబాలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌తో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, రాజులపాటి అచ్యుతరావు, గరికిపాటి వెంకట రామానాయుడు, బెజవాడ నాగబాబు, పామర్తి సాంబశివరావు తదితరులు పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి: మండల పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ శాఖకు సుమారు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ బంటుమిల్లి ఏఈఈ రవికుమార్ తెలిపారు. అర్తమూరు సబ్ స్టేషన్ పరిధిలో అర్తమూరు, కంచడం గ్రామాల్లో మూడు స్తంభాలు, బంటుమిల్లి, అర్తమూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించామన్నారు.

పిల్లల చదువుకు భరోసా కల్పించారు

గడప గడపకు మన ప్రభుత్వంలో 50వ డివిజన్ ప్రజలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తూ మా పిల్లల చదువుకు భరోసా ఇచ్చారని 50వ డివిజన్ వాసులు తెలిపారు. 50 డివిజన్ డ్రైవర్స్ కాలనీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలతో తమ పిల్లలు ప్రయోజకులు అవుతున్నారని వివరించారు. వీటితో పాటు అమలవుతున్న చేయూత, ఆసరా, చేదోడు, సున్నావడ్డీ, కాపునేస్తం తదితర పథకాల ద్వారా వస్తున్న నగదుతో కుటుంబ జీవనం మెరుగుపరుచుకుంటున్నామని పేర్ని కిట్టుకు తెలిపారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మరీదు నాగరాజు, కార్పొరేటర్లు ఐనం తాతారావు, పల్లి శేఖర్, జోగి చిరంజీవి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, నాయకులు పాల్గొన్నారు.

గంగాభవానీ అమ్మవారి జాతర ప్రారంభం

- అమ్మవారిని ఊరేగింపుగా స్టేషన్‌కు తీసుకువెళ్లిన పోలీసులు
- స్టేషన్‌లో తొలిపూజలు చేసిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది





స్టేషన్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న పోలీసులు : ప్రత్యేక అలంకారంలో గంగాభవానీ అమ్మవారు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కోడూరు పోలీసులు అమ్మవారికి తొలి పూజలు చేశారు. అమ్మవారి పుట్టింటివారైన కంచర్లపల్లి వంశీయులు ఉదయం పసుపు, కుంకుమ, చీరలు, పూలదండలు, గాజులను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రభను ఆలయం చుట్టూ ఊరేగించి, సారెను పండితులకు అందించారు. కోడూరు పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని తీసుకువెళ్లేందుకు ఊరేగింపుగా ఆలయానికి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. డీజే పాటల నడుమ భక్తులతో కలిసి సిబ్బంది డ్యాన్సులతో సందడి చేశారు. ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ మంత్రవచనాల నడుమ ఆలయంలో చిన్నఅమ్మవారికి పోలీసులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.50 గంటలకు అమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసి, ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచగా, అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్ వాహనాన్ని నడుపుతూ అమ్మవారిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అమ్మవారి వాహనం ముందు ధర్మకర్త కోట యుగంధరరావు దంపతులు నీటిని ఓరబోసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. యువకులు వీరతాడు, ఖడ్గం, కర్రలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పోలీస్‌స్టేషన్‌లో అమ్మవారికి తొలి పూజలు

గంగాభవానీ చిన్నఅమ్మవారిని పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లి తొలి పూజలు చేశారు. సీఐ జి.శ్రీనివాస్, కోడూరు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి స్టేషన్‌లో పూజలు నిర్వహించారు. అవనిగడ్డ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బంది, గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన పోలీసులు జాతరలో పాల్గొన్నారు. పోలీసులకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నూతన వస్త్రాలు అందించారు. ప్రజలతో కలిసి తీన్‌మార్ డ్యాన్సులు వేస్తూ సందడి చేశారు. అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, కోడూరు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్‌లు సిబ్బందితో కలిసి డ్యాన్సులు చేశారు.

ఆకట్టుకున్న మూలమూర్తి అలంకరణ

జాతరోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గంగాభవానీ అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల పుష్పాలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని తీర్చిదిద్దారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్‌లు పోలీసులతో కలిసి గ్రామోత్సవంలో నృత్యాలు చేశారు.

మేలులు చేసిన జగన్‌ను మరోసారి దీవించండి

పేర్ని కిట్టు



ఇంటి పట్టాను అందజేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: అన్నివర్గాలకు సంక్షేమ పథకాల ద్వారా మేలులు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కోరారు. 41వ డివిజన్‌లో ఆదివారం 236 మంది అర్హులైన పేదలకు నివేశనా స్థలాల పట్టాలను పేర్ని కిట్టు చేతుల మీదుగా అందజేశారు. డివిజన్‌లోని రాజీవ్ నగర్ రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం జగన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాలుగేళ్లుగా పలు రకాల సంక్షేమ పథకాలతో పేద ప్రజలను ఆదుకుంటున్నారని వివరించారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు పక్కా గృహాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. మచిలీపట్నం నియోజకవర్గంలో దాదాపు 28 వేల మంది లబ్ధిదారులకు నివేశనస్థల పట్టాలు అందజేశామన్నారు. ఈ పట్టాలను మంజూరు చేసిన సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే పేర్ని నానికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు ఐనం తాతారావు, పల్లి శేఖర్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కిలాని శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



గుడివాడలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గుడివాడటౌన్: బీసీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు అన్నివేళలా అండగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం నాయకులు అన్నారు. స్థానిక బీసీ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేవదాయశాఖ ఆధ్వర్యంలో కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని అభినందిస్తూ సీఎం కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బీసీల సంక్షేమానికి అన్ని విధాలుగా సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. దేవదాయ పాలక వర్గంలో ట్రస్ట్ బోర్డుల్లో కూడా నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ వారికి సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తున్నారని చెప్పారు. వీరి ఆర్థిక ఎదుగుదలకు ప్రతి ఏట నాయీబ్రాహ్మణుల వృత్తిదారుల ఖాతాల్లో రూ.10 వేలు అందించడంతో పాటు వారు పనిచేస్తున్న షాపులకు 150 యూనిట్లు కరెంట్ నెలవారీ ఉచితంగా ఇస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయలేదని వారు చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహరావు, నాయీ బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దొండపాటి వెంకట కృష్ణారావు, కార్యదర్శి ఎం.రామచంద్రమూర్తి, కేవీవీ ప్రసాద్, టీవీ రమణకుమార్, బి.కుమార్‌రాజా, బి.రామ్మోహనరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా సంఘాలకు మేలు



మాట్లాడుతున్న రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రాంబాబు

పామర్రు(పమిడిముక్కల): వైఎస్సార్ ఆసరాతోనే డ్వాక్రా సంఘాలకు మేలు జరుగుతుందని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తెలిపారు. మండలంలోని హనుమంతపురంలో వైఎస్సార్ ఆసరా మూడో విడతపై గడప గడపకు వెళ్లి డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు మూడు దశల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈనెల 25న వైఎస్సార్ ఆసరా నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తారని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబు, బుక్ కీపర్ మునిపల్లి అలేఖ్య, వీరంకి నాగమణి, వలంటీర్ కొడమంచిలి అనూష, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మంటాడలో..

మంటాడ సచివాలయం రెడ్డిపాలెం గ్రామంలో సాయి శక్తిసంఘ వీఓఏ బాకీ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆసరాకు అర్హత గల సంఘాలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు పాల్గొని అవగాహన కల్పించారు. పమిడిముక్కల మండలంలో 1330 గ్రూపులు ఉన్నాయన్నారు.

450 మందికి వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: డాక్టర్ మధు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం 29వ డివిజన్ చింతగుంటపాలెం దేవాంగ సంక్షేమ సంఘం భవనంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రారంభించారు. సీనియర్ న్యూరాలజిస్ట్ మెట్ల మధుసూదనరావు, జీర్ణకోశ వ్యాధి నిపుణులు పి.విజయకుమార్, జి నందిని 450 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గోస్వామి పలాస్త్రి పట్టీల కొట్టు వైద్యుడు వై. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రోగులకు ఎక్స్‌రే, బీపీ, షుగర్, రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

73 మంది యువకుల రక్తదానం

కోడూరు: లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక వెంకట రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 73 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మచిలీపట్నం బ్లడ్ బ్యాంక్‌కు చెందిన వైద్యులు శ్రావణి, ఇన్‌చార్జి రవి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు. సర్వీసెస్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధ్యక్షుడు పూతబోయిన అయ్యప్పస్వామిని పలువురు ప్రముఖులు అభినందించారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన రక్తదాత అన్నం యోగానందం శిబిరాన్ని ప్రారంభించారు. సర్వీసెస్ సభ్యులు బాదర్ల శ్రీనివాసరావు, బండే కిషోర్, బడే నాని, చిట్టిప్రోలు ఉత్తేజ్, దామోర్ల పవన్ పర్యవేక్షించారు.

గురిజేపల్లి సర్పంచ్ లక్ష్మణస్వామి మృతి



గూడూరు: గూడూరు మండలం గురిజేపల్లి సర్పంచ్ అద్దంకి లక్ష్మణస్వామి (చంటి) ఆదివారం మృతిచెందారు. లక్ష్మణస్వామికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి హైదరాబాదులోని తన సోదరుని ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఆదివారం శ్వాస సంబంధిత ఇబ్బందితో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి మచిలీపట్నంలోని ఆయన స్వగృహానికి ఆదివారం సాయంత్రం తీసుకువచ్చారు. సోమవారం సాయంత్రం గురిజేపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆయన మృతికి గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, గూడూరు పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, కారుమంచి కామేశ్వరరావు సంతాపం తెలిపారు.

కోడి పందెం శిబిరంపై దాడి

నలుగురి అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం బుద్దాలపాలెం గ్రామంలో కోడి పందేలపై బందరు రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. అందిన సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పందేలు వేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పందెంకోడితో పాటు రూ. 6,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని రూరల్ పోలీసులు తెలిపారు.

కనులపండువగా కల్యాణోత్సవం

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి భ్రమరాంబ, మల్లేశ్వరస్వాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గూడూరు వెంకట రామకృష్ణ యాజ్ఞికత్వంలో, గుడివాడ నాగతిరుమల వెంకట్రామానాయుడు, భోగయ్యానాయుడు, వెంకయ్య, నాగబాబు దంపతులతో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద, పండితుల మంత్రోచ్ఛరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అర్చకులు గూడూరు హనుమశ్శాస్త్రి, భవానీశంకర్ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు కల్యాణాన్ని పర్యవేక్షించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చేబోయిన వీర్రాజు, సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, డి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం

అవనిగడ్డ: పులిగడ్డ శివారు పల్లెపాలెంకు చెందిన క్యాన్సర్ బాధితుడు విశ్వనాథపల్లి శివనాగేశ్వరరావుకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు ఆదివారం రూ.5 వేలు సహాయం అందించారు. వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని మాస్టర్స్ ఈకే బాలభాను విద్యాలయం ఆధ్వర్యంలో 39వ గురు పూజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యాలయం ఆవరణలో లోక కల్యాణార్థం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సుదర్శన, నారాయణ హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగద్గురుపీఠం మచిలీపట్నం ప్రధాన నిర్వాహకుడు సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానిక యోగా సాధకులు, దేశం నలుమూలల నుంచి జగద్గురు పీఠం ప్రతినిధులు, హోమాది క్రతువు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ఈకే రచించిన విష్ణు సహస్రనామ ఆంగ్ల పుస్తకాన్ని అమెరికాలోని న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ డీన్ లక్ష్మీ ఎన్.రెడ్డి, సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, బీఆర్‌కే రాజు ఆవిష్కరించారు.

పరీక్షల సమయంలో ఆందోళన వద్దు



బంటుమిల్లి: విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్ కిషోర్ దంపతులను, ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

ప్రకటన

[illegible] ... షెడ్యూల్ : కృష్ణాజిల్లా, బందరు సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, బందరు మండలం, ... మున్సిపల్ వార్డు నెం. 15, ... [illegible]

పబ్లిక్ నోటీసు

[illegible]

మచిలీపట్నం, ది. 19-3-2023

చల్లపల్లి గ్రామ పంచాయితీ, చల్లపల్లి మండలం, కృష్ణాజిల్లా.
ఆర్.ఓ.సి. నెం. 13/2023 ఎ1 తేది. 18-03-2023

బహిరంగ వేలం ప్రకటన

కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, చల్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ఈ దిగువ తెల్పిన అయిటము హక్కును సదరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ది. 25-03-2023వ తేదీ శనివారం ఉదయం 11-00 గంటల నుండి సదరు గ్రామ పంచాయితీ కార్యదర్శి గారిచే గానీ లేక వారి అనుమతి పొందిన మరియొకరిచే గానీ హెచ్చుపాట మొత్తము వెంటనే చెల్లించు పద్ధతిపై బహిరంగవేలం నిర్వహించబడును. సదరు వేలంపాటలో పాల్గొనువారు నిర్ణీత ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను. ఇతర షరతులు వగైరా వివరములు ఆఫీసు పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

వ. నెం.	అయిటం వివరం	చెల్లించవల్సిన ధరావతు	పాటలో పాల్గొను సమయంలో దాఖలు చేయవల్సిన సాల్వెన్సీ వివరములు
1	చల్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో 2023-24 సం॥నకు రోజువారీ ఆశీలు వసూలు చేసుకునే హక్కు	రూ. 1,00,000/-లు	రూ. 5,00,000/-ల విలువగల సాల్వెన్సీ పత్రం దాఖలు చేయవలెను.

గమనిక : 1. సాల్వెన్సీ పత్రములు సంబంధిత రెవెన్యూశాఖ అధికారి నుండి పొంది దాఖలు చేయవలెను. 2. పై పాట బాపతు బకాయిలున్నవారు పాటల్లో పాల్గొనుటకు అనర్హులు.

పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, చల్లపల్లి